
అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ వృథా

పగలే వెలుగులు..!


ధార నుంచి కళింగనగర్ వస్తున్న రోడ్డులో వెలుగుతున్న హైమాస్క్ లైట్లు


పగటి వేళ వెలుగుతున్న విద్యుత్ లైట్


మాధవధార జంక్షన్ సమీపంలో వెలుగుతున్న లైట్లు


మాధవధారకు వెళ్లే మార్గంలో పగలు వెలుగుతున్న వీధి దీపాలు

మద్రిపాలెం : అధికారుల నిర్లక్ష్యంతో ఎంతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. భవిష్యత్ తరాలు వెలుగుల కోసం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ''విద్యుత్ ఎంతో విలువైందని, వృథా చేయకుండా కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని... ఇంధన పొదుపుతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని'' ప్రభుత్వం ఉదరగొడుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉంది. ఈ నెల 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తున్న అధికారులు... విద్యుత్‌ను పొదుపు చేయాల్సింది పోయి రాత్రీ పగలు తేడా లేకుండా వార్డుల్లో వీధి దీపాలు వెలుగుతున్నా కనీసం పట్టించుకోవడం లేదు.


మధ్యాహ్నం 12.30 గంటలకు బిర్లా జంక్షన్ వద్ద వెలుగుతున్న లైట్లు

అన్ని ప్రాంతాల్లోనూ ఒకటే తీరు

ముఖ్యంగా జీవీఎంసీ 50, 51వ వార్డుల్లో ప్రతీ చోట వీధి లైట్లు పగటి వేళ ఎండలో మెరుస్తూనే కనిపిస్తున్నాయి. 50వ వార్డు మురళీనగర్ ప్రాంతంలో పలు చోట్ల ఉదయం 7.30 గంటలు అయినా స్ట్రీట్ లైట్లు వెలుగుతూనే దర్శనమిస్తున్నాయి. తెన్నేటినగర్, మురళీనగర్, బిర్లా జంక్షన్, మాధవధార జంక్షన్‌లో హైమాస్క్ లైట్లతోపాటు ప్రతీ చోట వీధి దీపాలు వెలుగుతూనే ఉంటున్నాయని, ఎంతో విలువైన విద్యుత్ వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే 51వ వార్డులో పరిస్థితి మరీ దారుణంగా ఉందని... ఈ ప్రాంతంలోని అన్ని చోట్లా స్ట్రీట్ లైట్లు పగలంతా వెలుగుతూనే కనిపిస్తున్నాయి. మాధవధార ఆలయానికి వెళ్లే మార్గంలో సుమారు 10 వరకు స్ట్రీట్ లైట్లు ఉన్నాయి. అందులో ఏడు నుంచి ఎనిమిది లైట్లు వెలుగుతూ దర్శనమిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. అలాగే ధార నుంచి ఈస్ట్‌పార్కుకి డౌన్ దిగుతున్న క్రమంలో కళింగనగర్ మార్గ మధ్య హైమాస్క్ లైట్లు, అలాగే మెయిన్ రోడ్డుకి వచ్చే మార్గంలో దాదాపు దారిపొడవునా మధ్యాహ్నం 12 అయినా వీధి దీపాలు వెలగడంతో ప్రజాధనం ఎంతగానో వృథా అవుతోంది.

క్షేత్రస్థాయిలో పట్టించుకోని సిబ్బంది

ముఖ్యంగా అన్ని ప్రాంతాల్లోనూ పగటి వేళ వీధి లైట్లు వెలుగుతున్నా ఆ శాఖ అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో కనీసం పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంధన పొదుపు వారోత్సవాలు అంటూనే విద్యుత్‌ను వృథా చేయడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు స్పందించడం లేదని, కావాల్సిన సమయంలో లైట్లు పనిచేయవని, ఉదయం వేళ వెలుతురు ఉన్నప్పుడు లైట్లు ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు మొద్దు నిద్ర వీడాలని, అవసరమైన మరమ్మతులు చేపట్టి పగటి వేళ విద్యుత్ దీపాలు వెలగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు



పగలు విద్యుత్ సరఫరా ఎందుకని, పగటి వేళ ఎక్కడికక్కడ వీధి దీపాలు వెలుగుతున్నాయని చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. కార్పొరేటర్ హోదాలో ఇన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదంటే సామాన్యులను ఎవరు పట్టించుకుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలి. పగటి వేళ విద్యుత్ లైట్లు వెలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలి.
– రెయ్యి వెంకటరమణ, కార్పొరేటర్, 51వ వార్డు

20న ఐటీఐలో జాబ్‌మేళా

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాల భర్తీ కోసం శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 99668 61476లో సంప్రదించాలని సూచించారు.

21న దూదేకుల జన గర్జన


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నూర్ బాషా దూదేకుల సంఘం ప్రతినిధులు

సీతంపేట : ఏళ్ల తరబడి గుర్తింపు కోసం పోరాటం చేస్తున్న నూర్ బాషా దూదేకుల ముస్లిం సంఘాలు జన గర్జనకు పిలుపునిచ్చాయి. ఈ నెల 20, 21న ప్లీనరీ సమావేశం, జన గర్జన నిర్వహించి తమ ఐక్యతను చాటాలని నిర్ణయించినట్టు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ సుభాన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లు బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న ఉదయం పెందుర్తి ప్రశాంత్‌నగర్ పోర్టు కల్యాణ మండపంలో రాష్ట్ర నూర్ భాషా దూదేకుల సంఘ ప్రతినిధుల ప్లీనరీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. 21న ఉదయం పెందుర్తి వుడా లేఅవుట్ పార్కు గ్రౌండ్‌లో జన గర్జన నిర్వహిస్తామని తెలిపారు. దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, చట్ట సభల్లో, సామాజిక, ఆర్థిక రంగాల్లో తగు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. జన గర్జనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దూదేకుల, ముస్లిం, బీసీ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఉత్తరాంధ్ర కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ గర్జన కార్యక్రమాన్ని ముస్లిం బీసీ ప్రజలంతా జయప్రదం చేసి ఐక్యత చాటాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ రెహమాన్, ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడి దేముడు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఇబ్రహీం, ఆహ్వాన కమిటీ చైర్మన్ షేక్ ఖాన్, విశాఖ జిల్లా అధ్యక్షుడు షేక్ బాబ్జి, షేక్ సుభాన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా కుచేల దివసం


అటుకులు, బెల్లం సమర్పిస్తున్న భక్తులు

సీతంపేట : ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో బుధవారం కుచేల దివసం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుడికి కుచేలుడు అటుకులు ఇచ్చి స్వామి కృపకు పాత్రుడైన రోజు. ఈ సందర్భంగా పీఠంలో శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు జరిపారు. పలువురు భక్తులు స్వామిని దర్శించుకుని భక్తితో అటుకులు, బెల్లం సమర్పించారు. ఈ నెల 24న దూప పాశురం విన్నవిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

వైభవంగా మహాగణపతికి పూజలు


పూజలందుకున్న మహా గణపతి

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులోని శ్రీ మహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిరిడీ సాయిబాబా దేవస్థానంలో బుధవారం రాత్రి శ్రీ మహాగణపతి స్వామికి సంకట హర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. సిబ్బంది శివ, భక్తులు పాల్గొన్నారు.

సీతంపేట : సంకట హరచతుర్థి సందర్భంగా ప్రముఖ ఆలయాల్లో వినాయకునికి ప్రత్యేక పూజలు జరిపారు. సీతంపేట పార్వతీశ్వరాలయం, అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠం, శంకరమఠం రోడ్‌లోని విజయ గణపతి ఆలయాల్లో బుధవారం సాయంత్రం వినాయకునికి ప్రత్యేక పూజలు, గణపతి హోమం నిర్వహించారు. గణపతికి ప్రీతిపాత్రమైన తిథులలో చతుర్థి ఒకటని, మనుష్యులను కష్టాల నుంచి గట్టెక్కించే సంకట హర చతుర్థి వ్రతం ఎంతో విశిష్టమైనదని అర్చకులు తెలిపారు.

నేటి రెవెన్యూ సదస్సు వాయిదా


తహసీల్దార్ రమేష్

సీతమ్మధార : ప్రజల సమస్యలు, భూ వివాదాల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు వాయిదా పడ్డాయని విశాఖ అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ వెల్లడించారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. రెండో విడత షెడ్యూల్‌లో భాగంగా బుధవారం అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణ మండపంలో సదస్సు నిర్వహించామని తెలిపారు. ఈ నెల 19న జీవీఎంసీ 17, 18, 19, 20, 21, 22వ వార్డుల ప్రజలకు పెదవాల్తేరు గాంధీబొమ్మ సెంటర్‌లో నిర్వహించాల్సిన సదస్సు వాయిదా వేశామని తెలిపారు. ఈ నెల 20న మాత్రం షెడ్యూల్ ప్రకారం 14, 25, 26, 42, 43, 44 వార్డుల ప్రజలకు అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణమండపంలో సదస్సు జరుగుతుందని తెలిపారు. ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మద్రిపాలెం : జోన్ – 2 ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధి 11 కేవీ మాధవధార ఫీడర్ నిర్వహణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కనక మహాలక్ష్మి టెంపుల్ రోడ్డు, శ్రీ శాంతి ల్యాండ్ మార్కు ఏరియా, విజేత మార్ట్ ఏరియా, మాధవధార, అంబేడ్కర్ కాలనీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏరియా, మహత్ కాలనీ పార్కు, వంశీనగర్, జీఐఎస్ ప్రాంతం, వుడా అపార్టుమెంట్స్, గంగా గోదావరి అపార్టుమెంట్స్, అప్పయ్యనగర్, రైవాడ పంప్ హౌస్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

రాజకీయ సభలా రెవెన్యూ సదస్సు

విమర్శలతో పక్కదారి పట్టించేసిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 42, 44, 45, 46వ వార్డులకు సంబంధించి బుధవారం అక్కయ్యపాలెంలోని షాదీఖానా కల్యాణ మండపంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు రాజకీయ సభలా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ప్రసంగం అంతా విమర్శలు, నిందలు, ఆరోపణలతోనే సాగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇళ్లు కట్టుకునేవారిని కొంత మంది మీడియా రిపోర్టర్లు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, అటువంటి దందాను సహించనన్నారు. కేజీహెచ్‌లో బ్రోకర్లు పెరిగిపోయారని, అక్కడ సరైన వైద్యం అందించడం లేదని, పక్కనే ఉన్న ప్రైవేటు (ఆర్కే) హాస్పిటల్‌కు రోగులను పంపిస్తున్నారని ఆరోపించారు. నేనే ఆరోగ్య శాఖ మంత్రినైతే రోగులను వేధించే ప్రైవేట్ ఆస్పత్రులను మూయించేవాడినన్నారు. 2019 నుంచి 24 వరకు దుర్మార్గ పాలనను ప్రజలు చూశారని ఆరోపించారు. డబ్బులు లేక కూటమి ప్రభుత్వం ఏమీ చేయలేకపోతోందన్నారు. విశాఖపట్నం జిల్లాలో రోడ్లు బాగున్నాయని, ఇతర జిల్లాల్లో రోడ్లు బాగోలేనందున ఉచిత బస్సు పథకం అమలు ఆలస్యమవుతోందన్నారు. మొత్తానికి ప్రజల రెవెన్యూ సమస్యలు పరిష్కరించాల్సిన సదస్సును ఎమ్మెల్యే ఇలా పక్కదారి పట్టించేసి రాజకీయ విమర్శలకే ప్రాధాన్యమిచ్చారు. సదస్సులో తహసీల్దార్ ఎం.రమేష్, జోన్ – 5 జోనల్ కమిషనర్ రాము, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ట్రావెల్ బస్సులతో ఇక్కట్లు


రామాటాకీస్ రోడ్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సుల నుంచి రోడ్డుపై పడేసిన పార్సిల్స్

సీతంపేట : స్థానిక రామాటాకీస్ రోడ్‌లో ప్రైవేట్ ట్రావెల్ బస్సులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఈ మార్గంలో అంబేడ్కర్ భవన్ ఎదుట డ్రాపింగ్ పాయింట్ ఏర్పాటు చేసుకుని కార్గో పార్సిల్స్ పెద్ద ఎత్తున రోడ్‌పై డంప్ చేస్తున్నాయి. సగానికి పైగా రోడ్డును ఆక్రమించిన బస్సులు రోడ్డుపై పార్సిల్స్ పడేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఇక్కడ ట్రావెల్ బస్సుల నుంచి కార్గో అన్‌లోడింగ్ జరుగుతోంది. బస్సుల నుంచి దించిన పార్సిల్స్ తరలించడానికి వచ్చిన ఆటోలతో ఆ మార్గం అంతా రద్దీగా ఉంటోందని వాహన చోదకులు అంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే రామాటాకీస్ రోడ్ రెండు వైపులా ఉదయం నుంచి రాత్రి వరకు ట్రావెల్ బస్సులతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రావెల్ బస్సుల పికప్, డ్రాపింగ్ పాయింట్లు వేరే చోటుకు తరలించేలా తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇళ్లు మంజూరు చేయాలని వినతి


జెడ్సీ శివప్రసాద్‌తో మాట్లాడుతున్న మహిళలు

సీతమ్మధార : ప్రభుత్వం పక్కా ఇళ్లు కేటాయించాలని సీతమ్మధారలోని రాధాకృష్ణ నగర్ మహిళలు కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్ – 3 కార్యాలయంలో జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయనగరం జిల్లాకు చెందిన తాము అక్కడ గత 30 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నామని తెలిపారు. ఆ స్థలం వెంటనే ఖాళీ చేయాలని జోనల్ కార్యాలయం నుంచి తమకు నోటీసులు అందాయని గుర్తు చేశారు. తాము ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నామని జెడ్సీకి రశీదులు చూపించారు. వెంటనే తమకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఇళ్లు కేటాయించాలని కోరారు. అయితే సదరు స్థలం ఖాళీ చేయాలని హైకోర్టు ఆదేశించినందున వెంటనే ఖాళీ చేయాలని జెడ్సీ స్పష్టం చేశారు. మంగలక్ష్మి, బి.కాంతమ్మ, ఎ.సత్యవతి, వి.రాము, అప్పలనరసమ్మ, వి.సీతారామ్ తదితరులు వినతిపత్రం అందించారు.

అధిక వడ్డీ పేరుతో మోసం

- మరో వ్యక్తితో కలిసి పరారైన మహిళ
- సీపీని కలిసి ఫిర్యాదు చేసిన బాధితులు


అల్లిపురం: అధిక వడ్డీలు ఆశ చూపి రూ.4 కోట్లుతో వివాహిత పరారైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... అమ్మవారి వీధికి చెందిన మజ్జి ముత్యాలు భర్త, పిల్లలతో కలిసి సొంత ఇంట్లో నివసిస్తుంది. ఆమె గత రెండు సంవత్సరాలుగా స్థానిక మహిళలు, చిన్న చిన్న పనులు చేసుకునే వారి నుంచి అధిక వడ్డీల పేరుతో సుమారు రూ.4 కోట్లు వసూలు చేసింది. ఇటీవల ఆమె భర్త, పిల్లలను వదిలిపెట్టి స్థానికంగా గల సేనాపతి అప్పారావుతో కలిసి పరారైంది. దీంతో బాధితులు జి.వరలక్ష్మి, బి.జయలక్ష్మితో కలిసి వారం రోజుల క్రితం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పొదుపు సంఘానికి కూడా ఆమె కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ప్రతి నెల పొదుపు సంఘానికి చెందిన పది మంది మహిళలు కట్టే డబ్బులు కూడా ఆమె బ్యాంకులో జమ చేయలేదని తేలింది. గత ఏడాది కాలంగా పొదుపు డబ్బులు కట్టకున్నా యుసీడీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముత్యాలుపై టూటౌన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు కనీసం చర్యలు తీసుకోనందున పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చికి ఫిర్యాదు చేశామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

శ్రీరంగనాథుడికి పాశుర విన్నపం


వైభవుడికి దీపారాధన సమర్పిస్తున్న శేషాచార్యులు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4 గంటలకు ప్రాతఃకాలార్చన చేశారు. గోదాదేవిని మేళతాళాల మధ్య వేద మంత్రోచ్ఛరణతో అర్చకుడు శేషాచార్యులు, భక్తులు ప్రదక్షిణ చేశారు. అనంతరం తిరుప్పావై సేవా కాలం, విశేష భోగం సమర్పించారు. గోదాదేవి తరుపున శ్రీరంగనాథుడికి మూడో పాశురం విన్నవించారు. అనంతరం మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శేషాచార్యులు ఆధ్యాత్మిక ప్రవచనంలో భాగంగా మూడో పాశురం ప్రాధాన్యతను వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. మురళీనగర్ రామాలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా సీతారామచంద్రస్వామికి నిత్య పూజలతో పాటు పాశురం విన్నవించారు.

ఎరుకుమాంబకు వైభవంగా జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ పూజలు చేశారు. అమ్మవారికి భక్తుల స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దొండపర్తి అక్కయ్యపాలెం, రైల్వే న్యూ కాలనీ, మద్దిలపాలెం, రేసపువానిపాలెం, నక్కవానిపాలెం, పెదవాల్తేరు, లలిత నగర్, శంకరమఠం, సీతంపేట, రామాటాకీస్ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ స్వహస్తాలతో పసుపు నీళ్ల అమ్మవారిపై పోశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక్ కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ


ర్యాలీలో ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ నాయకులు, కార్మికులు

తాటిచెట్లపాలెం : ఇటీవల దేశవ్యాప్తంగా రైల్వేలో జరిగిన సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికల్లో ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో శ్రామిక్ కాంగ్రెస్ విజయం సాధించింది. ఈ సందర్భంగా బుధవారం యూనియన్ నాయకులు రైల్వేస్టేషన్ నుంచి డీఆర్ఎం కార్యాలయం వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్మికులకు అండగా నిలుస్తామని, ఇంతటి విజయాన్ని అందించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ టీవీ మాలీశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహు, జోనల్ ప్రెసిడెంట్ సంపత్‌కుమార్, ఆయా బ్రాంచిల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాలు అభివృద్ధి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జోనల్ కమిషనర్ రాము

కంచరపాలెం : జీవీఎంసీ 46వ వార్డు మధుసూధన నగర్, శాంతినగర్ కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను జోన్ – 5 కమిషనర్ రాముతో కలిసి డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ బుధవారం పరిశీలించారు. అసంపూర్తిగా వదిలేసిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్సీ రామును కోరారు. వార్డులో శానిటేషన్ పనులు ఏ విధంగా జరుగుతున్నాయో పరిశీలించారు. ఈ మేరకు వార్డు ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఈ ఉమామహేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ జాగరపు నరేష్, కె.చిన్న, ఈశ్వరరావు, లావణ్య, రామారావు, విజయలక్ష్మి, శ్రీను, సచివాలయ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసింహనగర్‌లో రోడ్డెక్కిన మురుగునీరు


నరసింహనగర్‌లో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్‌లో మురుగునీరు రోడ్డెక్కింది. దీంతో స్థానికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోర్టు సాగరమాల కన్వెన్షన్స్ (సుమంగళి) కల్యాణ మండపం వెనుక వైపు గల రహదారిలో యూజీడీ మురుగు గత మూడు రోజులుగా రోడ్డుపై ప్రవహిస్తోంది. దీనిని ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోలేదని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రూ.7.68 లక్షలతో ఎస్సీ వసతి గృహాల మరమ్మతులు


సీతమ్మధారలో గల ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహం

సీతమ్మధార : విశాఖలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇందులో భాగంగా సీతమ్మధారలో గల రెండు వసతి గృహాలకు రూ.7.68 లక్షల నిధులు విడుదల చేశారు. ఇక్కడి ప్రీ మెట్రిక్ వసతి గృహానికి రూ.5 లక్షలు మంజూరు చేశారని వసతిగృహం అధికారి సరోజిని తెలిపారు. ఈ వసతిగృహంలో 49 మంది విద్యార్థులున్నారు. అలాగే కళాశాల బాలుర వసతి గృహానికి రూ.2.68 లక్షలు విడుదల చేశారని వసతి గృహం అధికారి ప్రసాద్ వెల్లడించారు. ప్రీ మెట్రిక్ వసతిగృహంలో రేకుల షెడ్డు విస్తరణ, శ్లాబు ఏర్పాటు, ఇతర మరమ్మతులు చేయనున్నారు. ఇక కళాశాల బాలుర వసతి గృహంలో గచ్చులు, ఇతర పనుల కోసం నిధులు ఖర్చు చేయనున్నారు. ఈ వసతిగృహంలో 107 మంది కళాశాల విద్యార్థులున్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత

సీతమ్మధార: దయనీయ స్థితిలో ఉంటూ విశాఖ రైల్వే స్టేషన్‌లో మగ్గిపోతున్న 8 మంది మానసిక రోగులను రెస్క్యూ చేసిన ఏయూటీడీ సంస్థ వారికి ద్వారకానగర్‌లోని జీవీఎంసీ టీఎస్సార్ కాంప్లెక్స్ పురుషుల, మహిళల షెల్టర్ హోమ్స్‌లో ఆశ్రయం కల్పించారు. ముంబై నుంచి వచ్చి ఇక్కడ ఉండి పనిచేస్తున్న శ్రద్ధా బృందం ద్వారా చికిత్స చేయిస్తుండటంతో త్వరగా కోలుకుంటున్నారు. బిహార్ రాష్ట్రం రహతాస్‌కు చెందిన విజయ్, గయా నుంచి సుందర్, పాట్నాకు చెందిన మహిళ అత్తరి, అస్సాం డిబ్రుఘర్ చెందిన మిదుల్, త్రిపురా ఉనకోటి నుంచి అరుణబదేవ్, బ్రిజేష్‌కుమార్, బులంద్సర్ యూపీ పార్వతి, ఇండోర్ ఎంపీ నుంచి రాణి, గస్ శంకర్, పంజాబ్‌లను శ్రద్ధా ఫౌండేషన్ సభ్యుల ద్వారా కుటుంబ సభ్యులకు అప్పగించడానికి పంపించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్ టేకర్లు పాల్గొన్నారు.